# 'స్వచ్ఛతా హీ సేవ' పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు బోర్డు శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో బొల్లారం సదర్‌బజార్ శాస్త్రీ హైస్కూల్‌లో 'స్వచ్ఛతా హీసేవ' పై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపరింటెండెంట్ ఎం. దేవేందర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ అమిత్, ధఫేదార్ రాజేశ్ ఆధ్వర్యంలో కళాబృందాలు గీతాలతో అర్థమయ్యేలా వివరించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే 'విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవ' పై క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం అమిత్ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం



సదస్సుకు హాజరైన వక్తలు

సనత్‌నగర్: సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని డీఆర్‌డీఎల్ సైంటిస్ట్ డాక్టర్ జాన్ రోజారియో జెగరాజ్ అన్నారు. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్, లయోలా అకాడమీ డిగ్రీ, పీజీ, బీవీఆర్‌ఐటీ కళాశాలలు సంయుక్తంగా 'లెట్ అజ్ డ్రీమ్ వార్షిక కమ్యూనిటీ కాన్ఫరెన్స్'ను శనివారం నిర్వహించారు. 'పూర్తి సమాజాన్ని నిర్మించడం–వ్యూహాలు–పరిష్కారాలు' అనే థీమ్‌పై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత బలమైన లక్ష్యంతో ముందుకుసాగి సమాజాభివృద్ధిలో భాగస్వాములూ కావాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ యాజమాన్యంతో పాటు క్రిస్ట్ యూనివర్సిటీ డీన్ అండ్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ లిజోథామస్, అపోలో హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్ ఆశిష్ చౌహాన్‌తో పాటు విద్య, ఆరోగ్యం, సామాజిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

# రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



బయో మెడికల్ వేస్ట్‌ను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

- బేగంపేట సర్కిల్ డీఎంసీ సమ్మయ్య
- పాటిగడ్డ ప్రాంతంలో పర్యటన
- బయో మెడికల్ వేస్ట్ వేసిన వారికి రూ.25 వేల ఫైన్

సనత్‌నగర్: రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు.
బేగంపేట పాటిగడ్డ ప్రాంతంలో శనివారం ఆకస్మికంగా పర్యటించారు. హర్షిత క్లీనిక్ నిర్వాహకుడు మహ్మద్ రఫీక్ బయో మెడికల్ వేస్ట్‌ను రోడ్డుపై వేయడంతో రూ.25 వేల జరిమానా విధించారు. ఆర్‌ఎంపీలతో పాటు ఇతర ప్రైవేట్ క్లీనిక్‌ల నుంచి వెలువడే బయో మెడికల్ వేస్ట్‌ను బయట పడేయకుండా వాటిని తరలించే వాహనాలకు అందజేయాలని సూచించారు. అలాగే హోటళ్లు, వ్యాపార సంస్థల నిర్వాహకులు సైతం తమ కేంద్రాల వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ వాహనాలకు అందించాలని కోరారు. మున్ముందు రోడ్లపై గార్బేజ్ వల్లరబుల్ పాయింట్ (జీవీపీ)ను ఎత్తివేయనున్నామని తెలిపారు. ఇప్పటికే చాలావరకు తొలగించామని మిగితావి కూడా తీసివేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట డీఎంసీతో పాటు శానిటేషన్ సూపర్‌వైజర్ ధనాగౌడ్, సిబ్బంది కృష్ణ, సాయినాథ్, యాదయ్య పాల్గొన్నారు.

# వైద్య విద్యను డీమ్డ్ వర్సిటీలకు అప్పగించొద్దు



షబ్బీర్ అలీకి వినతి పత్రం అందజేస్తున్న స్వామిగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: వైద్య విద్యకు డీమ్డ్ యూనివర్సిటీలు అప్పగించవద్దని బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ పేర్కొన్నారు. మెడికల్, డెంటల్ విద్యకు ప్రైవేట్ డీమ్డ్ వర్సిటీల హోదాను ఇవ్వద్దని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి శనివారం వినతి పత్రం అందించారు. వైద్య విద్యను డీమ్డ్ వర్సిటీలకు అప్పగిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లను అమలు చేయకుండా పేద విద్యార్థులకు అన్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్య చట్టం ద్వారా యూజీసీని అడ్డుపెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పేద వర్గాలకు వైద్య విద్యను దూరం చేస్తుందని ధ్వజమెత్తారు. టీజేఎస్ రాష్ట్ర నాయకులు డా.నిజ్జన రమేశ్ ముదిరాజ్, డా.ఏడుకొండలు, వినోద్, బాలరాజు, పవన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని వర్గానికి న్యాయం చేయాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నేతకాని సంక్షేమ సంఘం నేతలు

కవాడిగూడ: నేతకాని సామాజిక వర్గానికి కార్పొరేషన్‌తోపాటు నామినేటెడ్ పదవుల్లో సముచిత న్యాయం కల్పిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. శనివారం నేతకాని సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన నేతకాని సామాజిక వర్గాన్ని ఎస్సీ 'ఏ'జాబితాలో చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 18 నుండి 20 లక్షలకు పైబడి నేతకాని జనాభా ఉందన్నారు. రాజకీయ, ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాయకులు నరసయ్య, ఎస్.సోంబాయి, బొర్లకుంట దీపక్, బొల్ల రాజమల్లు, దుర్గం శేఖర్, ఎస్.రాజేష్, వి.యువరాజ్, ఆర్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం



లాలాపేటలో వరద పరిస్థితి





వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ ఎల్ఎస్‌నగర్, అశోక్‌నగర్ తదితర వరద ప్రాంతాల్లో శనివారం పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఆయన వెంట ఏఈ కౌశిక్, శ్రీనివాస్, గిరి, బస్తీవాసులు కుమార్, లింగం, సుధాకర్ పాల్గొన్నారు.

**లాలాపేటలో ..**

లాలాపేట: తార్నాక, లాలాపేటలోని లోతట్టు ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్ బస్తీ రోడ్లన్ని జలమయమయ్యాయి. ఇండ్ల ముందు పార్క్ చేసిన కొన్ని వాహనాలు వరదలో మునిగిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం పాదచారులు, విద్యార్థులు బురద రోడ్లతో కొంత ఇబ్బంది పడ్డారు.

# 'డేడ్‌లాక్'తో మైండ్ బ్లాక్

## పురాతన భవనం నుంచి దుర్వాసన



ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలను అలరించిన అందమైన భవనం అది. నాడు కనువిందు చేసిన ఇదే భవనం నేడు అదే ప్రాంత ప్రజలకు ప్రాణ సంకటంగా పరిణమించింది. దేడ్‌లాక్ బంగ్లాగా సీతాఫల్‌మండి వాసులు పిలుచుకునే భవనం ఈప్రాంతంలో తొలి అందమైన బహుళ అంతస్తుల భవనం కావడం గమనార్హం. క్రమేణా సదరు భవనం కళావిహీనంగా మారి మొత్తంగా బూత్ బంగ్లాగా మారిపోయింది. చెత్తాచెదారం, మురుగునీటికి కేంద్రంగా మారిపోయింది. అటు యజమానులు స్థానికంగా లేకపోగా... ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించకపోవడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.
–సికింద్రాబాద్

- 30 ఏళ్లుగా స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ

సీతాఫల్‌మండిలోని ప్రతిష్టాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పక్కనే నెలకొన్న ఈ బంగ్లా ద్వారా వ్యాప్తి చెందుతున్న అనారోగ్యకర సమస్యలు ఇక్కడి ప్రజలకు నిత్యనరకంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ భవనంలో నివసించేవారు లేరు. కనీసం బంగ్లా ఆలనపాలన చూసేవారులేక బూత్‌బంగ్లాగా మారిపోయింది. ఇందులోంచి భరించలేని దుర్వాసన వెలువడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఈ రహదారులపై వెల్లువెత్తుతున్న డ్రైనేజీ నీరు కూడా నేరుగా బంగ్లా వద్దకే వచ్చి చేరుతుంది. రామాలయం సమీపంలోని ఈ భవనం ఉన్న కూడలిలో పాదచారులు కనీసం అడుగు తీసి అడుగు వెయ్యలేని దుస్థితి నెలకొన్నది.

**తాత్కాలిక పనులతో సరి..**

రెండేళ్ల క్రితం స్పందించిన అధికారులు స్థానికులు చెత్త, వ్యర్థాలు వేయకుండా నియంత్రించేందుకు యజమానులకు సంప్రదించి భవనం చుట్టూ ఇనుప రేకులతో భారీ కంచెను ఏర్పాటు చేయించారు. భవనం వద్ద పర్యవేక్షణ లేని కారణంగా ఇనుప కంచె కాస్త చిల్లర దొంగల పాలైంది. సమస్యలు యథాస్థితిలోనే ఉంటున్నాయి. భవన యజమానులకు నోటీసులు జారీ చేసి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. యజమానులు స్పందించకుంటే పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులే నేలమట్టం చేయాలని కోరుతున్నారు.

**త్వరలోనే పరిష్కారం..**



దేడ్‌లాక్ బంగ్లా నుంచి దుర్వాసన గురించి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయమై అధికారులతో చర్చించినం. భవన యాజమానుల మధ్య విభేదాల కారణంగా అధికారులు ఇంతకాలం పరిష్కారం చూపించలేకపోయారు. కొద్ది రోజుల్లో అధికారుల ద్వారా భవన యజమానులను సంప్రదించి పరిష్కారం చూపుతాం. –కార్పొరేటర్ సామల హేమ

## ప్రత్యేక ప్రార్థనలు



దర్గా ప్రార్థనల్లో సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురాలోని సయ్యద్ హజ్రత్ పీర్ అలీ షా ఖాద్రీ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవం శనివారం జరిగింది. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి హాజరై దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు అఫ్రోజ్, పాండు, అశోక్, మణికంఠ, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యమమే ఊపిరి, పోరాటమే ఆయన ధ్యేయం

**కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి**

లిబర్టీ: ఉద్యమమే ఊపిరిగా పోరాటమే ధ్యేయంగా జీవితాంతం కొండా లక్ష్మణ్ బాపూజీ పని చేశారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానందు అన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని లిబర్టీ సమీపాన ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మణ్‌బాపూజీ తొలితరం తెలంగాణ నాయకుడని తెలిపారు. తొలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో బాపూజీ ప్రధాన భూమిక పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడుగా స్వాతంత్ర్య ఉద్యమకారుడుగా గొప్ప పేరు సంపాదించారని బడుగు, బలహీన వర్గాల పక్షాన జీవితాంతం పని చేశారని స్పష్టం చేశారు.

## టెక్ మహీంద్రా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ

సనత్‌నగర్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద టెక్ మహీంద్రా ఫౌండేషన్‌కు చెందిన టెక్ మహీంద్రా అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పువ్వుల దీప్తి తెలిపారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా ఉన్న సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని ఆ సంస్థ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు ఆయా కోర్సుల్లో స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తామన్నారు. ప్రస్తుతం ఎంతో డిమాండ్ ఉన్న 'సప్లై చైన్ మేనేజ్‌మెంట్', 'వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్'లో శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ కూడా కల్పిస్తామని తెలిపారు. డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన 19 నుంచి 28 ఏళ్లలోపు యువత అర్హులని పేర్కొన్నారు. ఈ నెల చివరి వారంలో నూతన బ్యాచ్ ప్రారంభమవుతుందని మరిన్ని వివరాలకు 73373 32606 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## బేగంపేటలో హైడ్రా కమిషనర్ ఆకస్మిక పర్యటన



బేగంపేటలో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సనత్‌నగర్: బేగంపేట ప్రధాన రహదారిలో పీఅండ్‌టీ ఫ్లైఓవర్ ప్రవేశం వద్ద భారీగా వరద చేరడంతో బేగంపేట–పంజగుట్ట మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు అమీర్‌పేట ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

**బేగంపేటలో హైడ్రా కమిషనర్ పర్యటన..**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం రాత్రి బేగంపేటలో ఆకస్మికంగా పర్యటించారు. ఆ సమయంలో ప్రధాన రహదారి తటాకాన్ని తలపించింది. వరదలోనే నడుచుకుంటూ వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. నీరు భారీగా చేరడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఔట్‌లెట్ సరిగా లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ భారీగా నీరు చేరి సర్వసాధారణంగా మారిన పరిస్థితుల్లో ఆయన పర్యటన చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడైనా సమస్య కొలిక్కి వస్తుందేమోనని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అల్జీమర్స్‌పై అవగాహన అవసరం

శ్రీనగర్‌కాలనీ: అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన అవసరమని, రోగి తీవ్రమైన మతిమరుపుతో బాధపడుతున్నప్పుడు వారికి సహాయంగా ఉండాలని మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ కమిటీ–ఐపీఎస్, టీఎస్‌బీ డాక్టర్ జార్జిరెడ్డి అన్నారు. శనివారం ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలో వరల్డ్ అల్జీమర్స్ డే వేడుకలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఉస్మానియా మెడికల్ కాలేజ్, హైదరాబాద్ సైకియాట్రిక్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వయసు పెరిగిన తర్వాత వృద్ధాప్య దశలో వచ్చే ఈ అల్జీమర్స్ వ్యాధి తీవ్రత, రోగుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు అంశాలపై ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల, డాక్టర్ సుధారాణి సైకియాట్రిక్ హెచ్‌ఓడీ, హైదరాబాద్ సైకియాట్రిక్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ హృశికేష్ గిరి ప్రసాద్ వివరించారు.

**క్రైం కార్నర్..**

## చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

అడ్డగుట్ట: ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు రైల్వేస్టేషన్, రైళ్లలో ప్రయాణికుల బ్యాగులు, నగదు ఎతుకెళ్తున్నాడు. శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అదుపులోకి తీసుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. ఇప్పటికే పిక్ పాకెటింగ్, జిప్ ఆపరేషన్, ఏటీఎం కార్డుల చోరీల్లో నింధితుడని జీఆర్పీ పోలీసులు తెలిపారు. రూ. 10 వేల నగదు కూడా రికవరీ చేసినట్లు తెలిపారు.

## యువకుడి అదృశ్యం



సూర్యతేజ

చిలకలగూడ: స్నేహితుడి బర్త్‌డే వేడుకలకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సబిత తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన శ్యామల తన కుమారుడు సూర్యతేజ (19)తో కలిసి నగరానికి వలసవచ్చి సీతాఫల్‌మండి బీదలబస్తీలో నివసిస్తుంది. శ్యామల సర్వెంట్‌గా, సూర్యతేజ ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. ఈనెల 3న ఫ్రెండ్ పుట్టినరోజు వేడుకలకు స్కూటీపై నిజామాబాద్ వెళ్లాడు. 4న ఉదయం 8 గంటలకు తల్లి ఫోన్ చేయగా గంటలో వస్తానని చెప్పిన సూర్యతేజ ఇప్పటివరకు ఇంటికి రాలేదు. కాల్ చేస్తే సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. నిజామాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్ముగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని డౌన్‌లైన్ వద్ద శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో నేరెడ్‌మెట్‌లోని వినాయక్‌నగర్‌కు చెందిన మహ్మద్ అర్సలానుద్దీన్(22) పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ హాస్పిటల్ మార్చురీకి తరలించారు.

**మనస్తాపంతో రైల్వే ఉద్యోగి..**

రైల్వే టీటీఐతో గొడవపడి మనస్తాపం చెందిన ఓ రైల్వే ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. చిలకలగూడ రైల్వే క్వార్టర్స్‌కు చెందిన బూడిద నరేశ్ (27) సికింద్రాబాద్‌లో అసిస్టెంట్ రైల్వే ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల రైల్వే టీటీఐతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన నరేశ్ శనివారం తెల్లవారుజామున సంజీవయ్య పార్క్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

**రైలుకింద పడి..**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం –1లోని వాషింగ్ ఏరియా సమీపంలో శనివారం మధ్యాహ్నం సుమారు 45–50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## గుర్తుతెలియని మృతదేహాలు స్వాధీనం



చిలకలగూడ: గుర్తుతెలియని మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్ హాల్, అవుట్‌పేషెంట్ విభాగ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని పరీక్షించగా అప్పటికే మృతి చెంది ఉన్నారు. మృతదేహాలను గాంధీ మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. సంబంధిత వారు ఉంటే చిలకలగూడ పోలీసులను లేదా 040–27853597, 8712661252 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.39, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 70, క్యాప్సికం 70, పచ్చకాకర 48, పందిరి బీర 52, క్యాబేజీ 23, క్యారెట్ 47, దొండ 45, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 23, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 50, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 55, సొరకాయ 17, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 5–6, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## 30న పీసీబీలో పోటీలు

సనత్‌నగర్: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ)ఆధ్వర్యంలో ఈ నెల 30న 'ఇండియా కూలింగ్ యాక్షన్ ప్లాన్' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కార్యాలయం ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పాల్గొనే వారందరికీ సర్టిఫికెట్లతో పాటు విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. ప్రతి డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల నుంచి నలుగురు చొప్పున బృందాలుగా పాల్గొనే అవకాశం ఉందని, ఆసక్తి గలవారు 91773 03127, 99081 79676 లలో సంప్రదించాలని సూచించారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: లాలాపేట వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. జనహిత సేవా ట్రస్ట్ , కిమ్స్, అప్సా, బ్లూ ఫౌండేషన్లు, రెయిన్ బో హోమ్స్ సంస్థ సంయుక్తాధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ వైద్యులు దాదాపు 200 మందికి వైద్య సేవలందించారు. అలాగే హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, థైరాయిడ్, బరువు వంటి పరీక్షలు చేసి అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కిశోర్, డేనియల్, పార్వతి, అనిత, నీలిమా, దేవమ్మ, అప్సా కోఆర్డినేటర్ మంజుల, మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ బీ నర్సింగరావు, వినోభానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి పరమేశ్, అశోక్, కిరణ్‌కుమార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ కిట్లు అందిస్తున్న దాతలు

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో ఈక్షణ ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్టేషనరీ కిట్లను ఉచితంగా అందించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దాతలు ఆకాంక్షించారు. సుమారు 100 మంది విద్యార్థులకు బూట్లు, సాక్స్‌లు, బ్యాగులు, పెన్నులు, పెన్సిల్, ఎరైజర్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈక్షణ ఫౌండేషన్, హెల్పింగ్‌హ్యాండ్స్ ప్రతినిధులు నండూరి మేఘన, రాజశేఖర్‌రెడ్డి, రవితేజ, నికేత్, భాస్కర్, ప్రసన్న, హెచ్‌ఎం మల్లిఖార్జునరెడ్డి, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, జకియాబేగం, హసినాబేగం, నాగశృతి పాల్గొన్నారు.


## జాతీయ సదస్సు, వర్క్‌షాప్ బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ సదస్సు, వర్క్‌షాప్ బ్రోచర్‌ను రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డీన్ ప్రొ.మల్లేశం, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్, ఏఈజీ ఉపాధ్యక్షుడు బోయిలళ్ల ప్రొ.వీరయ్య శనివారం ఆవిష్కరించారు. ఏఈజీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9 నుంచి 11 వరకు వర్క్‌షాప్, 12, 13 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు సైంటిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డా.నర్సింహారావు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.వీరయ్య ప్రొ.ఉదయ లక్ష్మీ, డా. మంజుల, డా.విద్యాసాగర చారి తదితరులు పాల్గొన్నారు.

## ఫంక్షన్‌హాల్ గది కూల్చివేత అన్యాయం



కూల్చిన ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ప్రాంగణంలో నిర్మించిన గదిని జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేయడం అన్యాయమని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతల ప్రాంతంలో శనివారం వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, రాపాక అశోక్, మాచర్ల ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్, రాజు మాట్లాడుతూ ప్రజాధనంతో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన గదిని కూల్చివేయడం తగదన్నారు. వెంటనే గదిని పునః నిర్మించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి వర్గాలు వివాహాది, శుభకార్యాలు నిర్వహించుకునే మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ప్రాంగణంలోని గది ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగభూషణం, అబ్బాస్, కుషాల్, మురళీ, రుక్మొద్దీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.